క్లుప్తంగా

రజకుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని రజకుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ రజక వృత్తిదారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకుల కోసం దోబీఘాట్లను నిర్మించాలని, రజకులకుపై దాడులు జరుగకుండా అట్రాసిటీ తరహాలో కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, జయమ్మ, శేషాద్రి, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఏడీకి సన్మానం



ఏడీ రమేష్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా ఎఫ్‌ఏసీ బాధ్యతలు చేపట్టిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏడీ రమేష్‌బాబును శనివారం ఆసుపత్రి అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏడీ రమేష్‌బాబు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారి విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ద్వారా డిమాండ్ నోటీసులు జారీ చేశామని, బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం సులభమని పేర్కొన్నారు.

పీడీపీ ఉద్యోగుల ఆందోళన

కర్నూలు(రాజ్‌విహార్): సమస్యలు పరిష్కరించాలని ప్రజా రవాణ శాఖ ఉద్యోగులు చేస్తున్న నిరసన శనివారం పదో రోజు కొనసాగింది. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు-1, 2 డిపోల ముందు ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మద్దిలేటి, ఏపీ రెడ్డి, ఆర్‌వీఎం రావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిశ్శబ్దంగా దృష్టిని కబలించే గ్లకోమా

కర్నూలు(హాస్పిటల్): మనిషి దృష్టిని గ్లకోమా వ్యాధి నిశ్శబ్దంగా కబలించి వేస్తుందని, చాలా మందికి అది సోకినట్లే తెలియదని, పరీక్షల్లోనే బయటపడుతుందని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ పి.సుధాకర్‌రావు చెప్పారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బుధవారపేటలోని సుశీల నేత్రాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గ్లకోమా బాధితులు 1.20 కోట్ల మంది ఉంటారని.. ఒకసారి గ్లకోమా వస్తే చూపు తిరిగి రాదన్నారు. ప్రాథమిక దశలో ఉంటే మందులతో చికిత్స చేస్తామని, స్టేజి దాటితే లేజర్ లేదా శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందన్నారు. 40 ఏళ్లు దాటిన వారు సమగ్ర కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రోగ నిర్ధారణ.. ఇక సులభం

- పెద్దాసుపత్రిలో వ్యాధులన్నింటికీ ఒకే చోట పరీక్షలు
- అన్ని హంగులతో రూపుదిద్దుకున్న భవనం
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్

కర్నూలు(హాస్పిటల్): ఆదోనికి చెందిన రామస్వామి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ వార్డులో తనకున్న వ్యాధికి చికిత్స చేయించుకునేందుకు వచ్చాడు. అక్కడున్న ఓ డాక్టర్ అతనికి పలు రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు రాసి చేయించుకుని రావాలని సూచించాడు. డాక్టర్ రాసిన చీటీలు పట్టుకుని వ్యాధినిర్ధారణ పరీక్షా కేంద్రాలను వెతుక్కుంటూ అక్కడికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, మళ్లీ రిపోర్టులు తీసుకునేసరికి రెండు గంటలు పైగానే పట్టింది. ఈ లోగా ఓపీలో వైద్యులు వెళ్లిపోయారు. దీంతో చేసేదేమీ లేక రామస్వామి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారు. ఈ సమస్య రామస్వామి ఒక్కడిదే కాదు పెద్దాసుపత్రికి వచ్చే చాలా మంది ఇలాగే ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలోనే విధులు నిర్వహించే వారు సైతం ఇప్పటికీ ఏ పరీక్ష ఎక్కడ చేస్తారో తక్కున చెప్పలేని పరిస్థితి. అలాంటిది అక్షరజ్ఞానం లేని వారు ఆసుపత్రికి వస్తే వారి పరిస్థితి ఎలాగుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రిలో వ్యాధులన్నింటికీ ఒకే చోట నిర్ధారణ పరీక్షలు చేసేలా నూతన భవనం (న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్) ఏర్పాటు చేసింది. దీంతో రోగులకు వ్యాధి నిర్ధారణ సులభంగా మారనుంది. రోజూ వేలాది మంది వచ్చే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొత్త వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రం (న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్) నిర్మాణం పూర్తయ్యింది. త్వరగా దీనిని ప్రారంభించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అల్ట్రాసౌండ్ పరీక్ష కేంద్రం, ఎక్స్‌రే కేంద్రాలు, 24 ల్యాబ్ వద్ద గుంపులు గుంపులుగా జనం గుమిగూడి ఉంటున్నారు. కొన్నిసార్లు ఒకరినొకరు తోసుకుంటూ రిపోర్టులు, పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి. ఇకపై రోగులకు ఇలాంటి ఇబ్బంది ఉండదు. కొత్త భవనంలో సువిశాల భవనంలో రోగులు, వారి సహాయకులకు కూర్చోవడానికి అనువైన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు అంతస్తుల్లో ఒక్కో దాంట్లో ఒక్కో వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రాలు రానున్నాయి. ఇందులో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అన్ని రకాల రక్త, మల, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఇతర స్కానింగ్ పరీక్షలు ఒకేచోట ఉండనున్నాయి. పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్‌లు దీని నిర్మాణం పూర్తి చేసేందుకు విశేషంగా కృషి చేశారు.

ఆధునిక బ్లడ్‌బ్యాంక్ కూడా!

నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే ఆధునిక బ్లడ్‌బ్యాంక్ కూడా ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఓపీ భవనంలో రక్తనిధి ఉంది. దీనిని నూతన భవనానికి మార్చి కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దనున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఈ బ్లడ్‌బ్యాంక్‌లో కార్పొరేట్ బ్లడ్‌బ్యాంకులకు ఏ మాత్రం తీసిపోని పరికరాలున్నాయి. కానీ రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు అనువైన సౌకర్యాలు లేవు. నూతన భవనంలో నిబంధనలకు అనుగుణంగా అన్ని వసతి, సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో నూతన భవనంలోకి..



ఆసుపత్రిలో కొత్త డయాగ్నోస్టిక్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం అయ్యింది. ఇక విశాలమైన వెయిటింగ్ రూమ్‌లు, సకల సౌకర్యాలతో ఉన్న కాంప్లెక్స్ వల్ల రాయలసీమ ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. అన్ని పరీక్షలు ఒకేచోట చేయడం వల్ల రోగులు, వారి సహాయకులకు అటు ఇటూ తిరిగే ప్రయాస, సమయం తగ్గుతాయి. మరో వారం, పదిరోజుల్లో దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

–డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

5న 'చలో ఢిల్లీ'

కర్నూలు(సెంట్రల్): కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 5వ తేదీన చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు చెప్పారు. శనివారం కేకే భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రవాణా రంగాన్ని మోదీ ప్రభుత్వం కుదేలు చేస్తోందన్నారు. చలానాల పేరుతో కార్మికులను పోలీసులు, ఆర్టీఏ అధికారులు దోచుకుంటున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, నాగేశ్వరరావు, సాయిబాబా, విజయ్, ప్రభాకర్, రామాంజనేయులు, ఉమాదేవి, గోపాల్ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన ముగ్గురు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సుర్జీత్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదన్నారు. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా కార్మికులను విధుల నుంచి తొలగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, మారేళ్ల విజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనలతో సామాజిక సమరసత

కర్నూలు కల్చరల్: అన్నమయ్య సంకీర్తనలతో సామాజిక సమరసత చేకూరిందని పారిశ్రామికవేత్త టీజీ భరత్ అన్నారు. అన్నమాచార్య సేవా సమితి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో టీజీవీ కళాక్షేత్రంలో తాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధనా మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడి సంపూర్ణ అవతారాలు కొన్ని అయితే, అంశావతారాలు కొన్ని అన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆయుధమైన నందకం అనే అంశంతో జన్మించిన అన్నమయ్య తన రచనల ద్వారా సామాజిక చైతన్యం కలిగించారన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలిత పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తదితరులు అన్నమయ్య తత్వంపై ప్రసంగించారు. శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం అధ్యక్షులు బి.మల్లేశ్వరి ఆధ్వర్యంలో కుమారి దేవిశ్రీ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఉమ్మడి కర్నూలు శాఖ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సభ్యులు తూర్పాటి నారాయణ, ఆడిటర్ సోమశేఖర్, ఆవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు, అధ్యక్షులు యుగంధర్ శ్రేష్ఠి, సభ్యులు గుబ్బా రమణ, విశ్వనాథం, జయశేఖర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య ఆరాధనా మహోత్సవాల సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బాస్కెట్ బాల్ పోటీలో తలపడుతున్న బాలికలు

కర్నూలు (టౌన్): విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్జాతీయ మహిళాదినోత్సం పురస్కరించుకొని మహిళలకు బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ఆధ్వర్యంలో గత 8 రోజులుగా మహిళలకు క్రీడా పోటీలతో పాటు ఆరోగ్యం, పోషకాహారంపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజరావు, సిబ్బంది పాల్గొన్నారు.

19,20 తేదీల్లో పోటీలు

ఈ నెల 19వ తేదీ స్థానిక సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో స్కిప్పింగ్ రోప్, తొక్కుడు బిళ్ల, లెమన్ స్పూన్, 20వ తేదీ గొనెసంచులతో పరుగు పందెం, సూదిదారం, త్రోబాల్, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ రమణ వెల్లడించారు. ఆసక్తి కలిగిన యువతులు, మహిళలు పాల్గొనాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- డీఐఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ఓర్వకల్లు: గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గలో చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ టీకాల వల్ల గర్భిణులు, చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. టీకా వేసిన బాధితుల వివరాలను మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టులో అప్‌లోడ్ చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రాబర్ట్, సీహెచ్ఓ బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



టీకా మందులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ఈ వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శనివారం కల్లూరు శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. అందరికీ జీవనశైలి, మన ఆరోగ్యం-గృహ వైద్యం గురించి, ఈ వేసవిలో వ్యాధులకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటి గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎంవి. శేషఫణిరాజు, ఉపాధ్యాయులు పి.వాసవిదేవి, యు.మాలతి, కాంపౌండర్ మంగమ్మ పాల్గొన్నారు.

25న సీతారాముల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: ఈ నెల 25వ తేదీ రాత్రి 7 గంటలకు స్థానిక దామోదర సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.క్రిష్టన్న, కేసీ మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం వి నాయక్ ఘాట్ సమావేశ మందిరంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నవమిని పురస్కరించుకొని నగరంలోని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఓల్డ్‌సిటీలో ని రాంబొట్ల ఆలయం నుంచి మొదటి ఊరేగింపు, బళ్లారి చౌరస్తా నుంచి రెండో ఊరేగింపు, కల్లూరు ఎ స్టేట్ నుంచి మూడో ఊరేగింపు, నంద్యాల చెక్‌పోస్ట్ నుంచి నాలుగో ఊరేగింపు బయలు దేరి శోభాయాత్రగా కల్యాణోత్సవ వేదికకు చేరుకుంటాయన్నారు. 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటలకు ధార్మిక ప్రవచనం,7 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. వీహెచ్‌పీ కేంద్ర కార్యకారిణి కమిటీ సహకార్యదర్శి వై.రాఘవులు ప్రధాన వక్తగా, శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ ధార్మిక ప్రవచనం చేస్తారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, సమితి సభ్యులు మహాబలేష్, కగ్గోలు హరీష్‌బాబు, కల్కిమురళి, చల్లా దామోదర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగోజి రావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ సమతి సభ్యులు

ప్రగతి బాటలో కర్నూలు నగరం

- రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు
- మేయర్ బీవై రామయ్య వెల్లడి



పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): అధికారంలోకి వచ్చి రెండేళ్ల వ్యవధిలోనే కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థలో పాలకవర్గం వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జరదొడ్డి సుధాకర్‌ల సహకారంతో నగరాన్ని ప్రగతి బాటలో నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రెండేళ్లలో అందరి సహకారంతో కర్నూలు నగర పరిధిలో కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులు, నూతనంగా భవనాలు, పార్కుల అభివృద్ధి, వీధిదీపాలు, సుందరీకరణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మిగతా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అంతేగాక నగరపాలకకు ఆదాయం పెంచే దిశగా ఎన్నో చర్యలు, సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. పరిశుభ్రతలో చేపట్టిన వివిధ వినూత్న కార్యక్రమాలు, సంస్కరణలతో కర్నూలు స్వచ్ఛ సర్వేక్షన్‌లో జాతీయ స్థాయిలో 197వ ర్యాంకు నుంచి మొదటి ఏడాది 70వ ర్యాంకు, రెండవ ఏడాది 55వ ర్యాంకు సాధించిందని, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకులో నగరాన్ని నిలబెట్టామన్నారు. నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.80 కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే రూ.26 కోట్లతో నూతన నగరపాలక సంస్థ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోనే కర్నూలు నగరం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని చెప్పారు.

ప్రణాళికబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు(అర్బన్): విద్యా వ్యవస్థలోని ఆరోగ్యకరమైన పోటీలో ప్రణాళికాబద్ధంగా చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జీ పుల్లయ్య అన్నారు. శనివారం సాయంత్రం నగర శివారుల్లోని వీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ది ఓరియన్ హైస్కూల్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ పీసీహెచ్ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్, జీ పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, పలు విద్యా సంస్థల అధినేతలు పీబీవీ సుబ్బయ్య, కే శ్రీనివాసులు, ఇస్రో సైంటిస్ట్ వీ ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన మేధస్సుకు పదునుపెట్టి ఈ ప్రపంచానికి గొప్ప, గొప్ప ఆవిష్కరణలు అందించాలన్నారు.



సారంగదరియ పాటకు నృత్యం చేస్తున్న చిన్నారులు

నేడు ఉగాది కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపకులు కవి రాజ డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉదయం 10 గంటలకు శోభకృత్ నామ సంవత్సర కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. 12 మంది కవులు, 11 మంది కవయిత్రులు మొత్తం 23 మంది సాహితీ వేత్తలు సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

'ఈ-శ్రామ్'తో ప్రయోజనాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రామ్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ-శ్రామ్ కోసం సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

పీఆర్ ఇంజినీర్ల నిరసన



నినాదాలు చేస్తున్న పీఆర్ ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్లు నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య విగ్రహం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాయలసీమ జోనల్ కార్యదర్శి పీవీ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఈరన్న, పీఆర్ ఈఈ పీ రామకృష్ణారెడ్డి, డీఈఈలు నాగిరెడ్డి, శిల్పాశ్రీ, జేఈలు మురళీ, విజయభాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు సుజనప్రియ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలను ప్రశాంతంగా రాయాలి

- సమగ్ర శిక్షా అభియాన్ అదనపు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్

ఓర్వకల్లు:ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సమగ్ర శిక్షా అభియాన్ అదనపు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. శనివారంమండలంలోని కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను మరోసారి రివిజన్ చేసుకుని నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన డార్మెటరీ బ్లాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలిక్‌బాషా,ఏఈ విష్ణువర్ధన్, కాంట్రాక్టర్ జీకేవెంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డార్మెటరీ బ్లాక్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్

ఆరుగురికి గాయాలు

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని కొత్తూరు వద్ద శనివారం బైక్‌ను తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు కర్ణాటక వాసులు స్వల్పగాయాలపాలయ్యారు.కొత్తూరుకు చెందిన రామకృష్ణ బైక్‌పై పాలు విక్రయించి తిరిగి ఇంటికి వస్తుండగా శ్రీశైలం వెళ్తున్న తుఫాన్ వాహనం ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా తుఫాన్‌లో ఉన్న ఐదుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

పెంచికలపాడు సమీపంలో..

గూడూరు రూరల్: పెంచికలపాడు విశ్వభారతి జనరల్ ఆసుపత్రి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. కర్నూలు నుంచి కోడుమూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారని, ఆసుపత్రి వద్ద జరిగిన ప్రమాదంపై విచారించగా బాధితుల వివరాలు తెలియలేదని ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శనివారం మృతి చెందాడు. వివరాలు.. నంద్యాల పట్టణం నందమూరి నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(50)ఈ నెల 17న బంధువులతో కలిసి ఆటోలో కర్నూలుకు బయలుదేరాడు.కొలూరు మెట్టకు చేరుకోగానే జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు ఎడమ వైపు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేయగా ఆటోబోల్తా పడింది.ప్రమాదంలో ఐదుగురు గాయపడగా శాంతిరాం ఆస్పత్రికి తరలించారు.అక్కడ కోలుకోలేక కృష్ణ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దాసుపత్రిలో చలివేంద్రం ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సద్గురు దత్త కృపాలయం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోగుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ రోగుల సహాయకులకు రుచికరమైన భోజనం అందిస్తున్న సద్గురు దత్త కృపాలయం వారు వేసవిలో ప్రతి ఏడాది మంచినీటిని కూడా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాలనాగాంజన్,డాక్టర్ కిరణ్‌కుమార్,సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు కె.చంద్రశేఖర్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కబ్జా,బలగం, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కబ్జా, సార్, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, గనా
వెంకటేష్‌సినీ కాంప్లెక్స్: సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూటీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
భరత్ కాంప్లెక్స్: పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : కబ్జా
శ్రీరామ : షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ